# లంబకర్ణ

## పరశురాం.

అనువాదకుడు.

"చక్రపాణి"



చిత్రకారుడు.

యతీంద్ర కుమార సేన్

రాయబహద్దర్ వంశలోచన ముఖర్జీ, జమీందార్ అండ్ ఆనరరీ మాజిస్ట్రేట్- బలియా ఘాటా బెంచ్-ప్రతిదినం, సాయంత్రం కాలువ గట్టుకు షికారు వెళుతో వుంటాడు. నలభై దాటాక వీరి దేహం కూడా కొంచెం స్థూలమయింది. డాక్టర్ల సలహా ననుసరించి రోజూ కొంత దూరం నడిచి యక్సర్సైజ్ చేస్తూ, పప్పు అన్నం వదలి పూరీ కూరా తిన మొదలుబెట్టాడు.

కొంచెం సేపు పచారు చేశాక వంశలోచన బాబు అలసిపోయి కాలువ గట్టునే వున్న బండమీద జేబురుమాలు పరచి కూర్చున్నాడు. గడియారము చూస్తే- ఆరున్నర అయింది. జేష్టమాసం వెళ్ళిపో వచ్చింది. సిలోనుకు అప్పుడే మాన్సూను వచ్చేసింది. ఇక్కడ కూడా ఏదో ఒక రోజున హఠాత్తుగా వచ్చి పడిందంటే ఆశ్చర్యం లేదు. వంశలోచనుడు లేవటానికి ఉపక్రమించి, చేతులో వున్న బర్మా చుట్ట బాగా పీల్చాడు. ఇంతలో వెనుక వైపున ఎవరో అతని చొక్కా పట్టుకు లాగుతూ, సన్నని స్వరంతో 'హుఁ, హుఁ, హుఁ,' అంటున్నట్టు వినిపించింది. తిరిగి చూశాడు—మేకపోతు!

మేకపోతు బాగా బలిసి వుంది. మృదువుగా నల్లగా వున్న దేహం. పుట్ట కొక్కులవలె పొడుచుకు వచ్చిన రెండు కొమ్ములు. దీర్ఘంగా వ్రేలాడుతున్న చెవులు. మేకపోతు లేతది గానే వుంది. ఇంకా అజాతశ్మశ్రువు.

వంశలోచన బాబు గొణిగాడు- 'అరే! యిది ఎక్కడనుంచి వచ్చింది? ఎవరిది? ఎవ్వరూ కనబడటం లేదే!'

మేకపోతు జవాబివ్వలేదు. ముందుకువచ్చి లోలుపనేత్రాలతో చూస్తూ వీరి చుట్టూ తిరగ సాగింది. వంశలోచన బాబు దాని ముఖాన చేయివేసి వెనుకకు నెట్టుతూ అన్నాడు- పోబే! పో- యిక్కడనుంచి!'

మేకపోతు వెనక రెండుకాళ్లమీదా నిలబడి, ముందు రెండు కాళ్లూ వంచి, తల ప్రక్కకు పెట్టి రాయబహద్దరును టాకింది. రాయబహద్దరుకు కుతూహలం కలిగింది. మళ్లీ వెనక్కు నెట్టాడు. మేకపోతు తిరిగి వెనకకాళ్లమీద నిలబడి రాయబహద్దరు చేతిలోంచి చుట్ట లాక్కుంది.- భుజించటం పూర్తి అయాక అంది.- 'యి, యి, యి.' అంటే యింకేమన్నా వున్నాయా? అని.

సిగర్ కేసులో యింకో చుట్టమాత్రం వుంది రాయ బహద్దరు దాన్ని తీసి యిచ్చాడు. మేకపోతుకు తలా తిరగలేదు, వాంతీ కాలేదు- ఇంకా తత్సంబంధమైన లక్షణా లేవీ కూడా కనిపించలేదు. రెండో చుట్ట కూడా పూర్తిచేశాక మళ్లీ అడిగింది. 'యి, యి, యి.'

వంశలోచన బాబు అన్నాడు- 'ఇహ . లేవు. నీ విక పో. నేకూడా పోతున్నా.'

మేకపోతు విశ్వసింపలేదు. జేబులు వెతక సాగింది. వంశలోచన బాబు విధిలేక సిగర్ కేసు తీసి మేకపోతుకు చూపుతూ అన్నాడు- 'అంతగా నమ్మకం లేకపోతే యిదిగో చూచుకోవే?'

మేకపోతు ఒక్క వూడుపున సిగర్ కేసు లాక్కుని నమల సాగింది. రాయబహద్దరుకు నవ్వాలో, కోప్పడాలో తోచలేదు. చప్పున అనేశాడు- 'సాలా!'

ప్రొద్దు క్రుంక వచ్చింది. ఇహ ఆలస్యం చేయడం మంచిది కాదు. వంశలోచన బాబు గృహాన్ముఖుడయాడు. కాని మేకపోతు మాత్రం యీయన్ను వదలలేదు. వంశలోచనబాబు చాలా ఆదుర్దా బడ్డాడు.

మేకపోతు ఎవరిదయిందీ కూడా తెలియదు. అడుగుదామన్నా సమీపంలో ఎవ్వరూ లేరు. పోతును చూద్దామా జిడ్డులాగా అంటుకుంది- మభ్యపెట్టాలన్నా వీలుకావడం లేదు. ఇక యింటికి తీసుకు వెళ్లడం తప్ప వీరికి గత్యంతరం కనిపించలేదు. దోవలో మేకపోతు వాళ్లు కనబడితే మంచిదే- లేకపోతే రేపు ఉదయం ఏదో ఒక ఏర్పాటు చేయవచ్చనను కొన్నాడు.

ఇంటికి వచ్చే దోవలో వంశలోచన బాబు అనేక విధాల జాడలు తీశాడు. క్రియ మాత్రం శూన్యం. మేకపోతు ఎవరిదైందీ, ఏ మాత్రమూ ఆచూకీ చిక్కలా. చివరకు తప్పక తానే పెంచటానికి నిశ్చయించుకున్నాడు

అకస్మాత్తుగా వంశలోచనుని మనస్సులో ఒక సందేహము శూలంవలె వచ్చి తాకింది. తనకీ తన భార్యాకు యిప్పుడు ఏమాత్రమూ పొత్తుకలవటం లేదు. ఇవ్వాళటికి ఆరు రోజులనుంచి మాటలు కూడా లేవు. వీరి దాంపత్య కలహాలు కూడా అనాడంబరంగానే తేలిపోతూ వుంటవి. సామాన్యమైన ఒక ఎత్తిపొడుపు, రెండుమూడు నాతి తీక్షణ వాక్య బాణాలు, తదుపరి అహింసాత్మక అసహాయోగం- మాటలు బంద్! ఆఖరు కొక రోజున హఠాత్తుగా సంధి- పునర్మిలనమూ! ఇలా తరుచుగా జరుగుతూనే వుంటుంది. కాని, అలాగని అంత నిర్లక్ష్యముగా వదలటానికి కూడ వీల్లేదు. భార్యకు జంతు జాలమంటే బొత్తిగా సరిపడదు. వంశలోచన బాబుకు ఒకసారి కుక్కను పెంచాలనే సరదా కలిగింది. కాని భార్యా బలవద్విరోధమువల్ల సర్దాసర్దాగానే వుండిపోయింది. ఒక పోట్లాట జరుగుతూ వుండగా యింకో మేకను కూడా తీసుకు వెళ్ళితే? ఏడ్వాలనుకొనే ఆవిడకు కన్న తండ్రి కనపడ్డట్టు-'

నడుస్తూనే రాయబహద్దరు భార్యతో కాల్పనిక వాగ్యుద్ధం చేయసాగాడు. ఈ మేకపోతును పెంచు తాను- అడ్డు చెప్పటాని కెవ్వరి కధికారం వుంది? స్వతంత్రంగా ఒక సరదా తీర్చుకోటానికి తనకు హక్కు లేదూ? తానొక మానమర్యాదలూ- గౌరవ ప్రతిష్టలూ గల వ్యక్తి. బేల్ ఘూటా రోడ్డులో తనకో పెద్ద మేడుంది- బోలెడు భూముంది. తానొక బిరుదుగల ఆనరరీమ్యాజస్ట్రేటు- యాభై రూపాయల వరకు జరిమానా, మాసం వరకు శిక్షా వేయగలడు. అయితే యింక యీ దిగులెందుకూ- యీ సిగ్గెందుకూ- యీ నెర్వస్‌నెస్ ఎందుకూ? వంశలోచన బాబు తన మనస్సును మాటిమాటికీ ప్రబోధించుకోసాగాడు- తాని కెవ్వరినీ లక్ష్యపెట్టడు!

వంశలోచనబాబు డ్రాయింగురూంలో ప్రతి సాయంత్రమూ యిష్టాగోష్టి జరుగుతూ వుంటుంది. అందులో నిత్యమూ చాలామంది రాజా మహారాజాలు వధింపబడుతూ వుంటారు. గవర్నరూ, సురేశబెనర్జీ, మోహనబాగాన్, పరమార్థతత్త్వం, పొరుగింట ముసలితాకురుశ్రాద్ధం, ఆలీపూరు (మ్యూజియం)కు క్రొత్తగావచ్చిన ముసలి-ఒహా టేమిటి? ఏ ప్రసంగమూ వదిలిపెట్టరు. ప్రస్తుతం వారంరోజులబట్టి పులినిగురించి చర్చిస్తున్నారు. యీ సందర్భంలోనే నిన్న వంశలోచనుని బావమరిది నగేనుకూ—వేలు విడిచిన మేనల్లుడు ఉదయునికీ చేతులు కలియటం దాకా వచ్చింది. ఇతర సభ్యులు చాలా కష్టంతో వాళ్ళను కలియబడకుండా ఆపగలిగారు.

వంశలోచనుని డ్రాయింగురూము చాలాపెద్దది. బాగా అలంకరించబడిందికూడా—అంటే., చాలా పటాలూ. అద్దాలూ, అలమారీలూ, కుర్చీలూ, ఇత్యాదులతో భర్తీ! మొదట ప్రవేశించగానే మనదృష్టి కార్పెటుమీద వున్న పిల్లిమీద పడుతుంది. నల్లరంగు బ్యాక్ గ్రౌండ్ మీద మబ్బురంగు పిల్లి. యుద్ధసమయాన బజారులో తెల్లపూలు దొరకలేదు. కాబట్టే పిల్లికి యీదశ పట్టింది. సర్వసాధారణులకు తెలియు నిమిత్తమై బొమ్మక్రింద పెద్దపెద్ద యింగ్లీషు అక్షరాలతో C A T అని వ్రాసివుంది. దానిక్రింద రచయిత్రి పేరు-'మానినీదేవి.'-యీమె గృహిణి.

ఎదురుగావున్న గోడమీద రాధాకృష్ణుల తైల చిత్రం వకటి వుంది. కృష్ణుడు రాధాసమేతంగా కదంబ వృక్షంక్రింద నిలబడి వున్నాడు. గొప్ప సర్పమొకటి వారికి వత్తివేయటానికి ప్రయత్నిస్తోంది. కాని రాధాకృష్ణులకు మాత్రం వీసంకూడా భయంలేదు. కారణం సర్పం నిజమైందికాదు. ఓంకారం మాత్రమే! ఇంతే కాక శ్వేతస్త్రీల చిత్రాలుకూడా వున్నాయి. వాటి ఒంటిమీద సిల్కుచీరలూ, వాటి తలమీద నల్లపట్టు దారంతో చేయబడిన వెంట్రుకలూ. మైదాతో అంటించబడి వున్నాయి. ఇన్నిచేసినా వాటి ముఖాలింకా తెల్ల మొహాలమని కేకలువేసి చెప్పతున్నాయి. వాటి తిక్క అణచటానికై, బలవంతంగా వాటి ముక్కులకు బులాకీలు కుట్టివేశారు! గోడలలో వున్న రెండు అల్మారీలలో పింగాణీబొమ్మలూ, గాజు సామానులూ కుక్కికుక్కి వున్నాయి. పైన పడకగదిలో వున్న నాలుగు అల్మారీలలో వీటిస్థానం దొరకనందున-యివి క్రిందకువచ్చి ఆశ్రయించాల్సి వచ్చింది. ఇంతేగాక యింకా నానా విధములైన వస్తువులూ వున్నాయి.— రాజారాణీపటం, రాయబహద్దరును ఎరిగినా, ఎరగనీ, చిన్నాపెద్దా దొరల ఫోటోలూ, గిల్టు ఫ్రేములోవున్న అద్దము గడియారమూ-రాయబహద్దరు పట్టా-చాలా అభినందనపత్రాలూ- ఇత్యాదులు చాలా, చాలా-

ఇవాళకూడా సకాలానికే సభకూడింది. వంశలోచన బాబుయింకా షికారుకువెళ్ళి తిరిగిరాలేదు. వీరి ఆంతరంగిక మిత్రుడు వినోదబాబు చంకక్రిందకు దిళ్ళులాక్కుని, మోచేతి ఆధారంతో తివాసీమీద పండుకొని న్యూస్ పేపరు చదువుకొంటున్నాడు. వృద్ధ కేదారచటర్జీ చేత్తో హుక్కాపట్టుకొని కునికి

పాట్లు పడుతున్నాడు. నగేన్ ఉదయులు అతికష్టంతో కోసం ఆపుకొని మోకాళ్లమీద కూర్చుని వున్నారు–ఎప్పుడు వీలు చిక్కుతుందా కలియబడే టందుకన్నట్టు.

ఎక్కువసేపు వూరుకోలేక ఉదయుడన్నాడు–'నీ వేమైనాచెప్పు, పులికొలత తోకతోసహా ఎప్పుడూ వుండదు. అలాగయితే స్త్రీలకొలత జుట్టుతో సహా ఎందుకు వుండకూడదూ? మా ఆడంగులజుట్టు మూడడుగులకు తక్కువ వుండదు. అప్పుడు నీవుచెప్పే లెక్కను మావాళ్లకొలత ఎనిమిది అడుగులా?'


'చూడు ఉదయ్! నీభార్య వర్ణన నేను విన కూర్చోలా! పులిసంగతేమైనా చెప్పవలసి వుంటే చెప్పు'–నగేను డన్నాడు.

చటర్జీ మహాశయునకు మత్తు వదిలింది. అన్నాడు–'హుం! మీకిక పులి తప్పితే రెండో జంతువేదీ దొరకలా?'

ఇంతలో వంశలోచనుడు మేకపోతును తీసుకొని వచ్చాడు.

'వహ్వా! భలేమేకపోతు. ఎంతకు కొన్నావోయ్?' వినోదబాబు అడిగాడు. వంశలోచనుడు సంగతంతా చెప్పాడు.

'దేవార్సుసొత్తు, ఎక్కువరోజులు వుంచటం మంచిదికాదు. త్వరగాకానీ–రేపే ఆదివారము, కాళీ చేసివేద్దాము' వినోదుడన్నాడు.




"దివ్యంగావుంది......"

'దివ్యంగావుంది. కొవ్వుకూడా తన్నుకొస్తుంది'–చటర్జీ మహాశయుడు మేకపోతు పొట్టవొత్తుతో అన్నాడు.

నగేనుడు మేకపోతు తొడపట్టుకొని అన్నాడు–'ఉహుం, ఒకదేకిశాకూరకంటే ఎక్కువకాదు. పుల్లిపాయలూ పసుపూ కాస్త ఎక్కువగా పడవలసి వుంటుంది.

ఉదయుడన్నాడు–'అబ్బ! మా వాళ్ళు కూర చేస్తారూ–చెప్పటానికి...'

నగేశుడు గుడ్లు ఉరుముతో అన్నాడు–'ఉదయ్, మళ్ళీ?'

వంశ—'మీకిక జంతువునుచూచి నప్పటినుంచీ తినాలనేనా? ఒక అసహాయ ప్రాణి మనల్ని ఆశ్రయిస్తే కూరచేద్దామా కబాబుచేద్దామా అని మీరు కొట్టుకు చస్తున్నారు.'

మేకసంగతివిని వంశలోచనుని సప్తవర్షీయ కన్య టేంపీ, సర్వ కనిష్టపుత్రుడు ఘేంటూ పరిగెత్తు కొచ్చారు.

'బాబా, నే మేకను తింతా మేక మ–మ–మూం' ఘేంటూ అన్నాడు.

'ఛా,ఛా, వినివినీ, తింటంతింటం నేర్చుకున్నావు' వంశలోచను డన్నాడు.

'నాన్నా, నేను మేకను పెంచుతా. నాకొక ఎర్రతాడివ్వూ' టేంపీ అడిగింది.

వంశ–'సరే ముందు దీనికి మేతాగీతా చూడండి తర్వాత దీనితో మీయిష్టంవచ్చినట్టు ఆడుకోవచ్చు.

టేంపీ—'మేకపేరేంటి నాన్నా?'

'పేరుకేంభాగ్యం, చాలా వున్నాయి. భాసురక, దధిముఖ, మసీపుచ్ఛ, లంబకర్ణ–' వినోదుడు చెప్తున్నాడు.

'లంబకర్ణ బావుంది.' చటర్జీ అన్నాడు.

వంశలోచనుడు కుమార్తెను కొంచెంచాటుకు తీసుకుపోయి అడిగాడు—'టింపీ, మీయమ్మ ఏం చేస్తోంది?'

టింపీ—'ఇప్పుడే స్నానాలగదిలోకి పోయింది'

వంశ-'సరిగ్గాచూశా?-అలా అయితే ఒక ఘంట వరకూ ఫరవాలేదు! చూడూ, త్వరగాపోయి గుర్రపు దాణాలోంచి రెండు దోసెళ్ళు శెనగలు తీసుకొచ్చి మేకపోతుకు పెట్టమని దాసీతో చెప్పు?.

ఉత్సాహాతిశయంలో టింపీ తండ్రిగారి ఆదేశం మరచిపోయింది. మేకపోతు మెళ్ళో ఎర్రత్రాడుకట్టి లాక్కుంటూ లాక్కుంటూ యింట్లోకి తీసుకుపోయి కేకవేసింది—'అమ్మోయ్! త్వరగారా, లంబకర్ణను చూద్దుగాని-'

మానిని స్నానాలగదిలోంచి ముఖం తుడుచుకొంటూ బయటకు వచ్చింది-'చావుదాంతో-ఎవరు తీసుకొచ్చారురా దాన్ని? తీసుకుపో, తీసుకుపో-ఓదాసీ ఓ వాతాసీ-త్వరగా యీ మేకను బయటికికొట్టు! చీపురు తీసుకొని-'



"హుజూర్"

టింపీ-'హమ్మా! బయటికి కొట్టావూ? నాన్న తీసుకొచ్చాడు, నే పెంచుకుంటా'

ఘంటూ-'గుల్లంగుల్లం అని ఆడుకుంటా.'

మానిని-'జాగర్త! మీ ఆటలూ గీటలూ వదిలిస్తా ఘరానా మనుష్యులూ మేకల్ని పెంచటమూనూ!-బయటికి కొట్టండి, బయటికి!-ఓ దర్వాన్! ఓ చుకందరసింగ్-'

'హుజూర్' అని కేకవేసి చుకందరసింగ్ హాజరయ్యాడు. శీర్ణ ఖర్వాకృతి వృద్ధుడు. బుగ్గ పుస్తీలూ, నెరసిన గడ్డం మీసాలూ. భయంకరమైన గొంతూ, అంతకంటే భయంకరమైన పేరూ- వీటి బలంతోనే యితను, దొంగల నుంచీ దోపిడీ గాండ్రనుంచీ యీ దేవిడీ నిరక్షిస్తో వస్తున్నాడు.

ఇంటిలోపల గోల విని యిహ యుద్ధం తప్పదని రాయబహద్దరు నిశ్చయించుకొని, మనస్సును పురికొల్పుకొంటూ లోపలకు వచ్చాడు. గృహిణి అతని వంక చూడకండానే దర్వాన్‌తో అంది- 'ఏయ్, చుకందర సింగ్! ఈ మేకను బయటికి కొట్టు. మరుక్షణంలో యీ మేక వాకిలి బయట వుండకపోతే నీ వీపు పగలగొట్టిస్తా,

'బహూత్ అచ్ఛా.-' చుకందర సింగ్ అన్నాడు.

వంశ లోచనుడు దీనికి విరుద్ధంగా ఆజ్ఞాపించాడు- 'చూడూ చుకందర సింగ్! ఈమేక గేటు బయటికి పోయిందంటే నీ వుద్యోగంకూడా దానితోపాటు పోతుంది.'

'బహూత్ ఆచ్ఛా.-' చుకందర సింగ్ అన్నాడు.

మానిని భర్త వైపు ఒక అగ్ని బాణం వదిలి అంది 'ఆఁ టింపీ! దౌర్భాగ్యురాలా, ప్రొద్దుపోయింది- అన్నం అఘోరించవూ? మేకపిల్లతో నీ విక్కడ వూరేగు, నేను రేపే పోతున్నా హాట్ ఖోలా-'

హాట్ ఖోలాలో గృహిణి పిత్రాలయం.

వంశలోచనుడు అన్నాడు- 'టింపీ, డ్రాయింగు రూంలో ప్రక్క వేయమని దాసీ దానితో చెప్పు- నేనిమెట్లు ఎక్కా దిగా లేకుండా వున్నా. తాకుత్తో

మాంసం కూడా తిననని చెప్పు. కాసిని పూరీలూ, కాస్త పప్పూ, కొద్దిగా కూరా- చాలు.'

పూర్వం గొప్పగొప్పవారి అంతఃపురాల్లో ఒక్కొక్క కోపగృహం ఉంటూ వుండేది. క్రుద్ధ ఆర్యనారీమణులు అవుసరం వచ్చినప్పుడు దానిని ఆశ్రయిస్తో వుండేవారు. కాని ఆర్యపుత్రులకుమాత్రం అలాంటి తక్కా బందోబస్తు ఏమీలేదు. అందువల్లనే వారు ఒక భార్యతో కలహిస్తే రెండోభార్యా గుమ్మం తొక్కుతో వుండేవారు. ప్రస్తుతం ఖర్చులుపెరిగి, ధనం తరగటంవల్ల-ఈ చక్కని పూర్వాచారం లోపించిపోయింది. ఇప్పుడు స్త్రీలకు శరణ్యం పడక గదిలో నేలమీద చాపా-ఇంకా కొంచెం వ్యవహారము ముదిరితే కన్నవారియిల్లూ. ఇహాభర్తలకు ఏకమాత్ర ఆశ్రయం డ్రాయింగురూము.

భోంచేసిన తర్వాత వంశలోచనుడు డ్రాయింగు రూంలో ఒంటరిగా శయనించాడు. చీకటిగా వుంటం వల్ల వీరికి నిద్రపట్టలేదు. గదిలో ఒకమూలను సెమ్మా మీద ఆముదపుదీపం కునారిల్లుతూ వెలుగుతోంది. కొంచెంసేపు అటూఇటూ పొర్లి వంశలోచనుడు లేచి లైటువేసి భగవద్గీత తీసి చదువసాగాడు. ఇలాంటి దుస్సమయాలలో యీగీతే వీరికి సహాయం. భార్యతో అసహాయోగం కలిగినప్పుడు వీరు దీనిని తీసుకొని కాగితాలు తిరగవేస్తో, ప్రపంచముయొక్క అనిత్య తను మననం చేసుకోవటానికి ప్రయత్నిస్తో వుంటారు. కర్మయోగం చదువుతూ చదువుతూ వంశలోచనుడు ఆలోచించసాగాడు-మానిని ఈ విధంగా ప్రవర్తించ టానికి నేనేమి అన్యాయంచేశాను? తండ్రిగారింటికి వెళ్లుతుందట! అబ్బ, ఎంత తలబిరుసు! పోయిందా? తానిక తీసుకువచ్చే పేరన్నా ఎత్తడు-గర్జపడితే ఆవిడే తిరిగివస్తుంది. గృహిణికి ఇష్టమైన వస్తువులు కొంటూ వుండే తనకు యిష్టంలేకపోయినా నోరెత్తలేదు. మొన్న యీ మధ్యనేగా పదిహేను రాచిప్పలూ, యిరవైమూడు జాడీలూ రెండువందలయాభై రూపాయల డేకిశాలూ, పళ్ళేలూ, తుక్కూదుమారమూ అంతా కొనుక్కొచ్చింది. ఇక తను మేకను పెంచే దగ్గర తప్పువచ్చి కూర్చుంది! ఉహుఁ, సహించిన కొలదీ-

లంబకర్ణ వరండాలో పండుకొని వొళ్ళు రుద్దు కొంటూ వుంది. బర్మాచుట్టలు రెండు తింటంవల్ల నిద్రకూడా పట్టలేదు. రాత్రి ఒంటిఘంట ఆ ప్రాంతాన గాలి తీవ్రంగా వీచింది. చలిచలిగా వుంటంవల్ల లేచి నిలబడ్డది. డ్రాయింగ్‌రూంలో మినుకు మినుకుమని వెలుగుతున్నదీపం దానికి కనిపించింది. లంబకర్ణ తనను కట్టిన త్రాటిని కొరికివేసి, వాకిలి తెరిచివుంటంచూచి డ్రాయింగ్‌రూంలో ప్రవేశించింది.

ఆకలివేస్తోంది. గది నాలుగు వైపులా తిరిగి సూపర్‌వైజ్ చేసింది. తివాసీమీద న్యూసుపేపరు పడివుంది. నమిలిచూస్తే చప్పగావుంది. ఇహాగీతలోని మూడధ్యాయాలు పొట్టను పెట్టుకొంది. గీతతింటంవల్ల నాలుకకూడా ఎండిపోయింది. ఎత్తుగావున్న ముక్కాలి పీటమీద కూజాపెట్టివుంది. చూచితే మెడ అంత ఎత్తుపోలేదు. లంబకర్ణ ఆముదం దీపంవద్దకువెళ్ళి నాకి చూసింది. చాలా రుచిగావుంది. చప్పున ఆముద మంతా నాకేసింది. దీపం కొండెక్కింది.

* * *

వంశలోచనుడు సంధి కుదిరినట్టుగా కలగంటు న్నాడు......ప్రక్కకు పొర్లాడు-వేడిగా, మృదువుగా, స్పందనశీలంగావున్న స్పర్శ తగిలింది. నిద్రమత్తులోనే అన్నాడు- 'నీ వెప్పుడొచ్చావో?- జవాబు- 'హుఁ, హుఁహుఁ.'

ఇహ ఒకటే కేకలూ బొబ్బలూ! దొంగలు దొంగలు, పులిపులి- ఏయ్ చుకందరసింగ్ త్వరగారా- నగేన్- పూదో శీఘ్రంగా రండి- చంపేస్తోంది!

చుకందరసింగ్ తన ముంగేరీ తుపాకిలో మందు కూర సాగాడు. నగేనుడూ ఉదయుడూ గొడుగూ, లాఠీ టెన్నిసుబ్యాటూ- చేతికి చిక్కిందెల్లా తీసుకొని పరుగెత్తు కొచ్చారు. మానిని గాభరాగా, రొప్పుతూ రోస్తూ, క్రిందికి దిగివచ్చింది.

వంశంలోచనునికి నెమ్మదిగా అంతా అర్థమైంది. లంబకర్ణ రెండుమూడు చేతి పోట్లు తిని- 'బేబే-' అని అరవసాగింది! పులి అయినా బాగుండేదని వంశలోచనుడు అనుకొన్నాడు- బాగా శాస్తి జరిగిందని మానిని అనుకొంది.

ఎవరయినా పెద్దమనిషి మేకను పెంచుతాడేమో కనుక్కురమ్మని వంశలోచనుడు ఉదయాన్నే చుకందరసింగును బయటకు పంపించాడు. డబ్బు కక్కుర్తికి అమ్మనివాడూ, మాంసానికి ఆశపడి కోయనివాడూ, సరదాగా పెంచేవాడూ- వీరికి కావాలి. వాళ్లకూ వీళ్లకూ మేకను యివ్వడు!

ఎనిమిది ఘంటలయింది. వంశలోచనుడు వరండాలో కుర్చీమీద కూర్చుని మంగలిచేత గడ్డం చేయించు కొంటున్నాడు. వినోదబాబూ, నగేనుడూ, అమృతబజారు పత్రికలో డల్‌హౌసీ వర్సెస్ మోహన్‌బాగాన్ (ఫుట్‌బాల్ మ్యాచ్) చూస్తున్నారు. ఉదయుడు జీడిమామిడి కాయలు బేరం చేస్తున్నాడు. ఇంతలో చుకందరసింగ్ వచ్చి సలాము చేసి అన్నాడు- 'లాటూబాబూ ఆయేహైం.'

ముగ్గురు అనుచరులతోసహా లాటూబాబు వరాండాలోకి వచ్చి నమస్కారం చేశాడు. వచ్చిన వారందరి వేషాలూ దాదాపు ఒకే రకంగా వున్నాయి. మెడమీది వెంట్రుకలు అంటకత్తిరించీ- నెత్తిమీది జుట్టుక్రిందకు వాలి వుంది. ముందు వైపున నాలుగు వెంట్రుకలు మాత్రం పాముపడగ మాదిరిగా ఎత్తుకొని వున్నయి. చేతికి పాకెట్ వాచీ, మెడదగ్గర నుంచీ మోకాళ్లవరకూ పంజాబీ లాల్చీ- దానిలోగుండా గులాబీ రంగు బనీను బయటికి కనపడుతూ వుంది. కాళ్లకు ఫుల్‌స్లిప్పర్లూ- చెవిలో సిగరెట్టు పీకా.

'మీరాక ఎక్కడనుంచి?'- వంశలోచనుడు అడిగాడు.

'మాది బేల్‌ఘాటా కిరోసిన్ బ్యాండ్. బ్యాండ్ మాస్టరు నటవరనందిని నేనే. అందరూ నన్ను లాటూబాబూ అంటూ వుంటారు. మీరొక మేకను ధర్మం చేస్తారని, విచారించి పోదామని వచ్చాము' లాటూబాబు అన్నాడు.

'మీరు డబ్బా వాయిస్తో వుంటారా?'- వంశలోచనబాబు అడిగాడు.

లాటూ—'డబ్బా ఏమిటి సార్! శాస్త్రరీత్యా కన్సర్టు వాయిస్తాము. యిదిగో యీాయన నవీన నియోగి- క్లారియనెట్, యీాయన నవకుమార నందన్- ఫ్లూట్, యీాయన నరహరి నాగ్- వయొలిన్, వీరు కాక యింకా కార్‌నెట్, హార్మోనియం, ఢోలు, తాళాలు- అందరం కలిసి పంధొమ్మిదిమందివున్నాము. బర్మా ఆయిల్‌కంపెనీలో మేము పనిచేస్తో వుంటాము. మాచిన్న దొరగారి పెళ్లికి మాకు సెలవిచ్చారు. బ్యాండువాయించాము. దొరగారు ఉబ్బిపోయి టైటిల్ యిచ్చారు- 'కిరోసిన్ బ్యాండ్.'

వంశ—'చూడూ, మా దగ్గర ఒక మేకపోతుంది, దాన్ని మీకిస్తాను. కాని-'

లాటూ—'మేము పందొమ్మిదిమంది వున్నాము. ఒక్క మేకపోతు ఏమవుతుంది సార్!...ఏమంటావోయి నరహరి?'

వంశ—మీరు దాన్ని అమ్మకుండా, కోయకుండా, శ్రద్ధగా పెంచే షరత్తుమీదనైతేనే యిస్తాను.

లాటూ—'మీారన్నీ విచిత్రమైన సంగతులు సెలవిస్తున్నారండీ! ఘరానా మనుష్యులు ఎక్కడన్నా మేకను పెంచుతారూ?

నరహరి—'మేకకూడా కాదు పాలివ్వటానికి!'
నవీన—'చిలకకూడాకాదు పలకటానికి!'

నవకుమార— 'గొర్రెకూడా కాదు బొచ్చు కన్నా ఆశపడటానికి!'

వంశ— 'అదేదైనా కానీండి, నాకు మీతో అధికప్రసంగం చేయటానికి తీరికలేదు. కావాలో అక్కరలేదో తేల్చివేసెయ్యండి.'

లాటూబాబు మెడ గోకుకోసాగాడు. నరహరి అన్నాడు— 'తీసుకుపదవోయీ లాటూబాబూ? తీసుకుపద-పెద్ద మనుష్యులు అంతగా చెప్పుతున్నప్పుడు!'

వంశ— 'దాన్ని అమ్మకూడదనీ, కోయగూడదనీ మాత్రం జ్ఞాపకం వుంచుకోండి.'

లాటూ— 'ఆ విషయమై మీరు భయపడ నక్కర్లా. లాటూనందీ వాతప్పడుకాడు.'

లంబకర్ణను తీసికొని బేల్‌ఘాటా కిరోసిన్ బ్యాండ్ వెళ్ళిపోయింది.

'ముండాకొడుకులు తీసుకుపోతున్నారుకాని నాకు నమ్మకంలేదు.'—వంశలోచనుడు విచారంతో అన్నాడు.

'నీవేమీ దిగులుపడబోకు నీమేక గంధర్వ లోకంలో నివసిస్తుంది' వినోదుడు ధైర్యం చెప్పాడు.

సాయంత్రం మామూలుగా సభకూడింది. యివ్వాళకూడా పులిని గురించే చర్చ జరుగుతోంది. చటర్జీగారు చెప్పుతున్నారు--'అది మీ పొరపాటు, పులిఅనే జంతువ వేరేలేదు. అదొక అవస్థాభేదం-గొంగళి పురుగునుంచి తుమ్మెద అయినట్టు. నిన్నగాక మొన్న మీరు డార్విన్ అఘోరించారు. మాకిది గోచిపెట్టినప్పటినుంచీ తెల్సిందే! మన రాయబహద్దరు మేకపోతును నెల్లగొట్టి చాలా తెలివిగలపని చేశారు. కోసుకు తింటే చిక్కులేదు-కాని ఇంట్లోవుంచి పెంచటంమాత్రం-ఉహుఁ-'

వంశలోచనుడు కొత్తగీత కొని చాలా యింట్రస్టుగా చదువుతున్నాడు-'నాయం భూత్వాభవితా వానభూయః'—అంటే ఆత్మ ఒకసారివుంటే మరల నసించేదికాదు. 'అజోనిత్యం'-అజో అంటే మేక. కాన, మేకపోయిన తర్వాత ఇవ్వాళ సంధి కుదిరినా కుదరవచ్చు.

'హే కాంతేయ! తమ రొకమాటు గీత ఆవల పెట్టి చటర్జీగారి మాటలువినండి, మనోబలం కలుగుతుంది!'-వినోదుడన్నాడు.

ఉదయుడు—నే నప్పుడు సిమ్లాపోలా-,

నగేన్-'కోతలు కోయబోకు వూదో--నీపరుగు ఎంతవరకో నాకుతెల్సు! లిలువామేగా హద్దు.'

ఉదయ—'మామామ తండ్రి సిమ్లాలోనే వుండేవాడు. మా ఆవిడకూడా అక్కడే పెరిగింది. అందుకనే రంగంత-'

నగేన్—'ఖబర్‌దార్ వూదో?'

చటర్జీ-'నే చెప్పేది వినండీ...మజలీపూరులో వుండే చరణఘోషును ఎరుగుదురుకదూ?...అతని దగ్గర ఒక మేకపోతువుండేది. దానిపేరు భూతే. ముండాది తిని తెగబలిసి ఏమాడేది! యింతింత... కొమ్ములూ, ఇంత...గడ్డము! ఒకరోజు ఘోషుయింట్లో భోజనాలుపూరీ, పులావ్వూ, మాంసమూ-అన్నీ! చేతులు



"మూరాన్నుంచే సలాంపెట్టి తిరిగివచ్చాడు"

కడిగేటప్పుడు చూస్తిమి కదా- భూతే మాంసం తింటోంది. చెప్పాను-"చూచావ్ ఘోష్! ఇప్పుడే యీ మేకను కొట్టేసేయి. పిల్లాజల్లతో కాపురం కెలిగిస్తు

న్నావు భయంలేదూ?" ఘోషు నామాటవినలా బీద వాడిమాట అనుభవం అయ్యాకగాని తెలిసిరాదు, ఆ మరునాడే భూషే మాయమైంది. ఊరంతా వెదికాము. ఎక్కడా కనపడలా; ఒక యీడాదిగడిచాక మహాశయ్! అదే మేక సుందరవనంలో కనిపించింది, కొమ్ములు లేవనే చెప్పాలి, గడ్డం దాదాపు అంతా రాలిపోయింది. నోరు రాచిప్పవలె తెరుచుకొనివుంది. రంగు పచ్చిపసుపు దానిమీద మిస్టర్! మచ్చలు మచ్చలూ! చారలు చారలూ! కేకవేశాము-"భూషే!"—భూశే గాండ్రుమంది. దూరాన్నుంచే సలాముపెట్టి తిరిగి వచ్చాము.'

'లాటూ బాబూ ఆయేహై.'

అనుచరులతోసహా లాటూబాబు ప్రవేశించాడు. లంబకర్ణకూడా వెంటవుంది. వినోదు డడిగాడు—'ఏం బ్యాండ్ మాస్టర్, మళ్లీ ఏం పనిమీద?'

లాటూబాబులో ఆ పూర్వపుకళ లేదు. క్రాపు అంతా చెరిగిపోయింది. కళ్లు గుంటలుపడ్డా



"నాశనమై పోయాను సార్"

చొక్కా చిరిగిపోయింది. కళ్లవెంట నీరుకారుస్తూ అన్నాడు-'నాశన మైనానుసార్! సొమ్ముపోయి చస్తున్నాను. హాం: హాం: హాం:'

'ఎందుకలా ఏడుస్తావు లాటూబాబు! కొంచెం ధైర్యం తెచ్చుకో అయ్యగారేదో ఒకదోవ చూపకపోరులే' నరహరి ఒదార్చాడు.

'ఏమయిందేం?...సంగతేమిటి?' వంశలోచనుడు భయంతో అడిగాడు.

లాటూ—'సార్! ఆమేక-'

'హుం నేను చెప్పటంలా?'-చటర్జీ అన్నాడు.

లాటూ—'డోలు చర్మం కొరికింది. ఫిడేలు నరాలన్నీతింది. హార్మోనియం బెల్లోస్ చప్పరించివేసింది. ఇంకా-ఇంకా-ఈపంజాబీ లాల్చీ కొరికి తొంభై రూపాయలనోట్లు-హాః, హాః, హాః-'

నరహరి-'తినేసింది సార్, మేకకా దిది సైతాను! అంతాపోయింది లాటూ ప్రాణాలే మీకోసం గుటగుటలాడుతున్నై.'

వంశ—'మంచి చిక్కులో పడవేసిందే.'

నరహరి-'సలామ్ హుజూర్! లాటూ స్థితికాస్త చూడండి. ఏదో ఏర్పాటు చేయకపోతే పాపం చచ్చిపోతాడు.'

వంశలోచనుడు కొంచెంగా ఆలోచించి అన్నాడు-'భేదికిస్తే?'

'ఏమిసార్, యిదేనా మీతీర్పు! డబ్బుపోయిన దుఃఖంతో నేను చస్తూంటే మీరు భేదికితీసుకోమంటారా?' లాటూశోక గద్గద కంఠంతో అన్నాడు.

వంశ—నీవుకాదు తీసుకోవటం-మేకకు యివ్వమనిచెప్పాను."

నరహరి—అయ్యయ్యో, తమకు ఆమేక సంగతి తెలియదుబాబూ! ఎప్పుడో జీర్ణించుకొని వుంటుంది. ఫిడేలు నరాలూ, డోలుచర్మమూ హార్మోనియం బెల్లోస్-అన్నీ హరించివుంటయి-ఇక నోట్లేమి లెక్క!

వినోద—'లాటూబాబూ పుర్రె మాత్రం అట్టే పెట్టింది- చర్మంతిని.'

వంశీ—'వినోద్! జరిగిందేమో జరిగింది. ఇహ నీవే డామేజస్ (నష్ట పరిహారం) నిర్ణయించు- పాపం వాళ్లు నష్టపడకుండా, నాకు అన్యాయం జరగకుండా. యివ్వాళటికి మేక యింట్లోనే వుంటుంది. రేపు ఏదో ఒక ఏర్పాటు చేస్తాను.'

అనేక రేట్లువేసి- కమీషన్లు కొట్టివేసి, వంద రూపాయలకు తెల్చాడు. వంశీ లోచనుడు బేరం చేయలేదు.

లాటూ బాబుదళం డబ్బు తీసుకు వెళ్ళిపోయింది.

లంబకర్ణ మళ్ళీ వచ్చిందని విని టేంపీ పరుగెత్తుకొచ్చింది. వినోదుడు అన్నాడు- 'టేంపూ రాణీ! శీఘ్రంగా పోయి మీ అమ్మతో చెప్పూ- రేపు మేమిక్కడ భోంచేస్తామని. పూరీ, పులావు, మాంసం-'

టేంపీ—'నాన్నగారు యిహ మాంసం తినరు'

వినోదు—ఏమిటీ! నిజమే నంటోయి వంశీూ? ప్రేమ ఒక మేకమీదనుంచి విశ్వంలో వుండే మేకలన్నిటి మీదికీ ప్రాకిందా యేం? -సరే నీవు తినవద్దులే, మేమే తింటాము. పో టేంపూ, అన్నీ సమకూర్చమని మీ అమ్మతో చెప్పూ.'

టేంపీ- 'ఇప్పుడు వల్ల కాదు. అమ్మా నాన్నా పోట్లాడుకున్నారు. మాట్లాడు కోవటం కూడా లేదు.'

వంశీలోచనుడు కసరుతో అన్నాడు—'ఆఁఆఁ! మాటలు కూడా లేవూ? నీకంతా తెలుసు. పోపో, పెద్దపెత్తనగత్తె వయ్యావు!'

టేంపీ- 'భలే బాగా వుంది. నాకేమీ తెలియదను కొంటున్నావేం?- అలా అయితే అమ్మ అన్నీ నాకెందుకు చెప్పుతుంది?- టేంపీ, పంఖాను రిపేరు చేయించాలి టేంపీ, ఈ నెల్లో యింకో రెండువందలు కావాలి- మరి నీకెందుకు చెప్పదూ?'

వంశీ—'ఇహ చాలించు వాగుడు.'

వినోద—'హే రావుబహద్దర్! అమ్మాయిని ఎక్కువగా వత్తిడి చేయబోకు- ఇంకా చాల సంగతులు కక్కుస్తుంది. వ్యవహారం బాగా బెడిసిందా ఏం?'

వశీం— 'ఇప్పటికంతా తేలిపోయేదే నోయి. ఈ మేక ఒకటి వచ్చి మళ్లీ మొదటికి తెచ్చింది.'

వినోద—'ముండాది విభీషణుడి మాదిరిగా లంకకు చేటు తెచ్చింది. నీకూ్కడా అంత మమకార మెందుకోయ్, దానిమీద? నీటిలోవుంటూ మొసలితో విరోధం తెచ్చుకోవటం అంత తెలివిగల పని కాదు!'

వంశీ లోచనుడు దీర్ఘనిశ్వాసం విడిచి అన్నాడు—'చూద్దాం రేపు ఏదో ఒహటి.'

ఆ రాత్రి వంశీలోచనుడు డ్రాయింగు రూములో విరహ శయ్య మీదే కాలం గడిపాడు. మేక గుర్రపు శాలలో కట్టివేశారు. ఉపద్రవం చేయటానికేమీ వీలు చిక్కలేదు.

మరునాడు సాయంత్రం అయిదున్నర ఘంటలకు, వంశీ లోచనుడు షికారుకు బయలుదేరబోతూ, తన నెవరన్నా చూస్తున్నారేమోనని ఇంటి నాలుగు వైపులా చూచాడు, భార్యా పిల్లలు పైన వున్నారు. దాసదాసీలు పని పాటల్లో మునిగి వున్నారు. చుకందర సింగు తన గదిలో కూర్చొని భంగు కలుపు కొంటున్నాడు. లంబకర్ణ గుర్రపు శాలలో కట్టవేయబడి వుంది. ఆ కట్టెత్రాటి హద్దులోనే అది ఎగిరి, గంతు వేస్తూంది. వంశీ లోచనుడు చప్పుడు చేయకుండా త్రాడు విప్పి మేకతో సహా బయట పడ్డాడు.

త్రోవలో ఎరిగినవా రెవరయినా కనబడతారేమోనని వంశీలోచనుడు రాచ మార్గం వదలి సందు గొందుల గుండా పోసాగాడు. పోతూ పోతూ ఒక అంగట్లో జిలేబీ పొట్లం కూడా కట్టించాడు.

క్రమంగా జన సమ్మర్దం వదిలి జనశూన్యంగా వున్న కాలువ గట్టుకు చేరాడు.

ఇవ్వాళ యీాయన తన చేతులు మీాదుగా లంబకర్ణను విసర్జిస్తాడు. ఎక్కడ దొరికిందో అక్కడే వదిలేస్తాడు- తర్వాత దాని నొసట ఏది రాసివుంటే అదే జరుగుతుంది. మామూలు చోటుకు వచ్చాక వంశలోచనుడు జిలేబీ పొట్లం తీసి లంబకర్ణ ముందు పెట్టాడు. తర్వాత జేబులో నుంచి కాగితం ముక్క తీసి యిలా వ్రాశాడు.-

"ఈ మేక జేల్ ఘాటా కాలువ వొడ్డున దొరికింది. పోషించలేక మరల దీన్ని యిక్కడే వదిలేస్తున్నాను. అల్లా, కాళీ, ఏసుక్రీస్తూ సాక్షి- దీన్నెవ్వరూ చంపకూడదు."

వ్రాయటం పూర్తిఅయాక కాయితం మడిచి ఒక చిన్న రేకు డబ్బీలో పెట్టి, లంబకర్ణ మెడలో చాలా జాగ్రత్తగా కట్టాడు. తర్వాత వంశలోచనుడు లంబకర్ణ వొంటిమీాద ఆఖరుసారి చేయివేసి నిమిరి నెమ్మదిగా తప్పుకుపోయాడు. లంబకర్ణ అప్పుడు ఆహారంలో మగ్నమైవుంది.

దూరం వచ్చికూడా వంశలోచనుడు మాటిమాటికి వెనక్కు తిరిగి చూడసాగాడు. లంబకర్ణ అప్పటికి ఆహారం పూర్తిచేసి అటూఇటూ చూస్తోవుంది. తన్ను చూసిందా వెంటబడుతుంది-ఇటు ఆకాశం స్థితి చూద్దామా సరిగాలేదు. వంశలోచనుడు త్వరితంగా నడువసాగాడు.

ఉహూఁ, ఇహనడువలేడు. ఆయాసం వచ్చేసింది. రోడ్డు ప్రక్కన ఒక వటవృక్షం వుంది. వంశలోచనుడు దానిక్రింద కూర్చోబడ్డాడు. లంబకర్ణ ఇహ కనబడటంలేదు. తనకిక ముక్తి!-ఇంకా కొన్నాళ్లున్నట్టయితే జడభరతుని గతిపట్టేది! ఈ దరిద్రపు నల్లజీవానికి ఆశ్రయం యివ్వబోయి తాను చాలా కష్టాలుపడ్డాడు. గృహిణికి దానిమీాద గొంతువరకు వుంది. స్నేహితులూ, చుట్టాలూ, దాన్ని తింటానికి నోరు తెరుచుకొని కూర్చున్నారు. తానొక్కడూ ఎంతవరకని సర్దుకు వస్తాడు? అయ్యారే! సత్యయుగం ఎంత బాగుండేది? శరణాగత కపోతంకోసం శిబిచక్రవర్తి తనదేహం యివ్వబోతే పట్టమహిషి పట్టుగానీ-సభాసదుల సతాయింపుగానీ-ఏదీకూడా అడ్డురాలేదు!

దడదడ ధాం. ఆకాశంలో ఎవరూదండోరా వేసేది? వంశలోచనుడు చకితుడై పైవంక చూశాడు. ఆకాశంమధ్య సీసపు రంగుపట్టీ వేసినట్టుగా వుంది. దూరాన ఒక గుంపు తెల్ల కొంగలు రెక్కలు బాగా విసరుతూ పారిపోతున్నాయి. అంతా నిశ్శబ్దం- ఆకు కూడా అల్లాడటం లేదు. ఆసన్న దుర్యోగానికి భయపడి స్థావర జంగములు చలనం లేకుండా స్తంభించి పోయినై. వంశలోచనుడు లేచాడు. కాని మరల కూర్చున్నాడు. త్వరగా నడవటం వల్ల గుండె దడదడా కొట్టుకొంటోంది.

అకస్మాత్తుగా ఆకాశం కత్తితో నరికినట్టు రెండుగా చీలింది. ఒక్కటే మెరుపు. పెళపెళపెళా- పగిలిన ఆకాశం తిరిగి అతుకు లేకుండా కలిసిపోయింది. ఈశాన్యపు దిక్కునుంచి పల్చని తెర ఒకటి కమ్ముకొస్తూంది. ఆమె వెనకభాగమంతా దానితో కప్పివేయబడింది. ముందుకూడా ఇక ఆలస్యం వుండదు. ఇదిగో వచ్చేస్తుంది....వచ్చేసింది కూడా! చెట్లూ చేమలూ నేలను ముద్దుపెట్టుకోటానికి వస్తున్నవి. ఎత్తుగా వున్న తాళ వృక్షాలు తలలూపుతో తమ ఆటంకాన్ని తెలియ జేస్తున్నవి. కాకులు ఆర్తానాదం చేస్తూ ఎరగటానికి ప్రయత్నించి గాలి తాకుడుకు ఆగలేక మళ్లీ చెట్టు కొమ్మనే పట్టుకొని కూర్చున్నవి. ప్రచండమైన గాలీ- ప్రచండతరమైన వృష్టీ- ఈ నగణ్యవిటపీ, ఈక్షుద్ర కలకత్తానూ ముంచివేయటానికి స్వర్గంలో వుండే ముప్ఫయిమూడుకోట్ల దేవతలూ బారులు తీరి పెద్దపెద్ద కుంభాలతో నీరు క్రుమ్మ

రించినట్లు! మూసల ధారా, ధారల మధ్య మ ధ్యా తుంపరలూ... భూమి అంతా జలమయం అయింది.

మాన మర్యాదలూ దుస్తులు గిస్తులూ అన్నీ పోయినై. ఇక ప్రాణాలుదక్కితే చాలు. దరిద్రపు మేక, క్షణంలో-

వంశలోచనుని కళ్లముందర వంగ పండు రంగు ప్రకాశం ఆడినట్లైంది. దానితో పాటు ఆకాశంలో సంచితమైనయున్న యిరవై కోట్ల వోల్టుల ఎలక్ట్రిసిటీ సమీపంలోవున్న నారికేళవృక్షపు బ్రహ్మరంధ్రాన్ని భేధించుకొని భూగర్భంలో ప్రవేసించింది.

రాసులకురాసులు ఆవపూలు. జగత్తు లుప్తం. నీవూ లేవు-నేనూ లేను! వంశలోచనుడు స్మృతిపోగొట్టుకొన్నాడు.

*           *           *

వర్షం వెలిసిందికాని ఇంకా బంయిబంయిమనిగాలి వీస్తూనేవుంది. వెలిమబ్బు తెరను భేదించుకొని దేవతలు, మినుకు మినుకుమను చుక్కలనే లాంతర్లు తీసుకొని క్రిందిస్థితి సూపర్వైజు చేస్తున్నారు.

వంశలోచనుడు కర్దమశయ్యమీాద పండుకొని నెమ్మదిగా స్మృతి తెచ్చుకొంటున్నాడు, తాను ఎవరు?- రాయబహద్దరు. ఎక్కడ?—కాలువదగ్గర. ఆ శబ్దం దేనిది?-గోదురుకప్పది. వంశలోచనుని నష్ట స్మృతి తిరిగివచ్చింది-మరి మేక?

మనుష్యశబ్దం చెవిని బడుతోంది. ఎవరూ తనను పిల్చేది?-'మామా,-అల్లుడూ-వంశూ ఎక్కడోయి? హుజూర్-'

సమీాపంలో ఒక గుర్రపుబండి ఆగివుంది. కొందరు లాంతర్లు తీసుకొని అటుయిటూ తిరుగుతూ తనను కేకలువేస్తున్నారు. ఒక పరిచిత నారీ కంఠము నుండి క్రందనధ్వనికూడా వినబడసాగింది.

*           *           *

మానిని అంటోంది—'ఇవ్వాళ మీారు పైకి పోవల్సిన అవుసరం లేదు....ఓ దాసీ, ఈడ్రాయింగు రూంలోనే ప్రక్క కొంచెం పెద్దదిగా వేయి. యిటు



"ఈ వేడి పూరీల నాలుగూ మీారు తినవలసిందే"

చూడూ నా బాలీసు కూడా యిచ్చిపో....ఆ చటర్జి పాడు యిక్కడనుంచి వదలడేం?...అదేమిటీ?- అలా నావల్ల కాదు. ఈవేడి వేడి పూరీలు నాలుగు మీారు తినవల్సిందే. నాతోడు!...ఆ సీసాలోది ఏమిటీ- అది కాస్తె టీలో వేసి యివ్వమంటారా?'

'హుఁ, హుఁ, హూఁ-'

వంశలోచనుడు స్ప్రింగువలె లేచి అన్నాడు- అన్నాడు- 'ఆఁ, అది మళ్లీ వచ్చిందీ? కర్ర తీసుకురా దీని—'

'మీారేమిటీ చేసేది?- కొట్టబోకండి! పాపం అది వాన వెలవంగానే వచ్చి మీా కబురు చెప్పింది- కాబట్టే మీారు తిరిగి దక్కారు. ఓ హరీ మధుసూదన్!'- మానిని అంది.

లంబకర్ణ ఇంట్లోనే వుండిపోయింది. శశికళవలె దినదినాభివృద్ధి కూడా పొందసాగింది. క్రమీాణా

దానికి జానెడు గడ్డం వచ్చింది. రాయ బహద్దరు దాని విషయమై అసలు శ్రద్ధే తీసుకోవడం లేదు. ఎలక్షనులో నిమగ్నుడై వున్నాడు. మానిని లంబకర్ణ కొమ్ములకు కెమికల్ బంగారం పొదిగించింది. దానికి సబ్బూ ఫినాయిలూ కూడా శాంక్షన్ చేయించింది ఎన్నిచేసినా విశేష లాభం కనిపించలేదు. లోకులు దూరంగావుండే దాన్ని వెటకారం చేస్తూ వుంటారు. లంబకర్ణ గంభీరంగా అంతా వింటూ వుంటుంది. మరీ సహించ లేనప్పుడు మాత్రం 'వ, వ, వా,' అంటుంది. అంటే మీ యిష్టంవచ్చినట్టు మీరు వాగండి - నాకేమీ లెక్కలేదని!



---

శ్రీ 'పరశురాం' కథలను అనువదించుటకూ, 'చక్రపాణి' హక్కులు పొందియున్నాడు. 'చిత్రగుప్త' లో ప్రకటింప బడుచూవచ్చిన ఈ అనువాదములను పుస్తకరూపముగా ప్రకటించదలచిన ప్రకాశకులు ఈ క్రింది చిరునామాకు వ్రాయప్రార్థితులు.

'చక్రపాణి'

యువకార్యాలయం

తెనాలి.